కె.బాలగోపాల్

# దొడ్డిదారిన మరో విపత్తు


ప్రకృతి బీభత్సం మనల్ని నిస్సహాయుల్ని చేస్తుంది కదూ? బాధితులు ఏడుస్తుంటే, దిక్కుతోచక విలవిలలాడుతుంటే చూస్తూండడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయత చాలా బాధాకరమైనది. అయితే 'ప్రకృతి బీభత్సం' అంటున్నాం గానీ నిన్నమొన్నటి వరదలో ప్రకృతి పాలెంత ఉందో మానవ స్వయంకృతం పాలూ అంత ఉంది. గేట్లు సకాలంలో ఎత్తారా, షట్టర్లు సకాలంలో మూశారా, వగైరాలే కాదు. మానవ నాగరికత ప్రకృతితో ఆడుకుంటున్న ఆట ప్రాణాంతకమైనదనడానికి మనకు లభిస్తున్న అనేక సూచికలలో ఇటువంటి అకాల విపత్తులను లెక్కపెట్టక తప్పని రోజులొచ్చాయి.

మనల్ని నిస్సహాయంగా పక్కకు నెట్టి మన జీవితాలను వినాశనం మైపు తీసుకుపోతున్న విపత్తులింకా ఉన్నాయి. దీనిని వర్తమాన కాలపు గుణంగా ప్రకటించవచ్చునేమో. నిజానికి 'ఇంకా ఉన్నాయి' అంటున్నాం గానీ అంతిమంగా అన్నిటి మూలమూ ఒకటే. అది విపరీతరూపం తీసుకున్న పెట్టుబడి దాహం.

ప్రపంచ వాణిజ్యసంస్థ (డబ్ల్యుటిఓ)ను దీని ప్రధాన సాధనంగా చాలా కాలంగా భావిస్తూ వస్తున్నాముగానీ దానిని దాటిపోయేవి మన ప్రభుత్వం దాదాపు 30 దేశాలతో చేసుకున్న, చేసుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టిఏలు). వీటి ఫలితాలు మన మీద వచ్చి పడకముందే వీటి గురించి కొంచెమైనా తెలుసుకొని ప్రపంచీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న ఆందోళనల్లో వీటిని వ్యతిరేకించే కార్యక్రమాన్ని చేర్చితే విపత్తును కొంతయినా వెనక్కి నెట్టగలుగుతామేమో.

సంస్కరణ, సరళం, స్వేచ్ఛ మొదలైనవి మామూలుగా మంచి భావం గల మాటలు. వినాశాన్ని అందంగా అలంకరించే కార్పొరేట్ పెట్టుబడి తత్వం వీటిని చెడ్డ మాటలు చేసింది. అందుకే ఆర్థిక సంస్కరణలు, సరళీకరణ, స్వేచ్ఛా వాణిజ్యం మన భాషలో భయం గొలిపే మాటలయ్యాయి. స్వేచ్ఛా వాణిజ్యం అంటే వాణిజ్యాన్ని అన్ని రంగాలలోకీ యథేచ్ఛగా విస్తరించి లాభాలు పోగుచేసుకునే స్వేచ్ఛ ఉండడం అని ఈ పాటికి అందరికీ బోధపడి ఉండాలి. ఆ వాణిజ్యం వాడకపు వస్తువుల నుంచి పెట్టుబడి రంగానికీ, సేవా రంగానికీ మానవ మేధో ఉత్పత్తులకూ విస్తరించడంతో 'గాట్' పోయి 'డబ్ల్యుటిఓ' వచ్చిందని కూడ ఈ పాటికి చాలామందికి తెలిసి ఉండాలి. ఈ ప్రపంచ వాణిజ్యసంస్థ లక్ష్యం ఏమిటంటే పెట్టుబడిగల వాడికి వస్తువులు అమ్ముకునే విషయం లోనే కాదు బ్యాంకింగ్ ఇన్సూరెన్స్, విద్యా వైద్యరంగాలలో సైతం ఎల్లలు ఎరుగని వ్యాపార స్వేచ్ఛ ఉండాలి, దాని కోసం ఎక్కడికయినా పోయి పెట్టుబడులు పెట్టే స్వేచ్ఛ ఉండాలి; మళ్లీ తాను చేసే సాంకేతిక ఆవిష్కరణలతో వ్యాపారం చేసుకునే స్వేచ్ఛ మాత్రం తనకొక్కడికే ఉండాలి. అటువంటి ప్రపంచాన్ని సాధించడం దాని లక్ష్యం. అయితే ప్రపంచ వాణిజ్య సంస్థ గాట్‌కు వారసురాలిగా పుట్టడం వల్ల అది బహుళ దేశాల ఉమ్మడి వేదికగా ఉండక తప్పలేదు. అందులో పెద్దదేశాల పెత్తనం స్పష్టంగానే ఉన్నప్పటికీ వెనుకబడిన దేశాలు అప్పుడప్పుడు గుంపుకట్టి తమ ప్రయోజనాలను కాపాడుకోగలిగాయి. పెట్టుబడికి అంత స్వేచ్ఛ ఇస్తే చిన్న వృత్తులూ వ్యాపారాలూ వ్యవసాయమూ చేసుకొని బతికే ప్రజలు తట్టుకోలేరన్న ఆందోళన ఈ దేశాల ప్రభుత్వాలను నిజంగా ఎంతగా కదిలించిందో చెప్పలేము గానీ, ఆ తట్టుకోలేని పరిస్థితి తమ పాలనను అభద్రం చేస్తుందన్న ఆందోళన వారిని నిస్సందేహంగా కదిలించి ఉంటుంది.

అందువల్ల 'ఉరుగ్వే రౌండ్'తో మొదలయిన ఈ 15 సంవత్సరాల కాలంలో ప్రపంచ వాణిజ్య సంస్థ తన లక్ష్యాన్ని చాలా మేరకు సాధించింది గానీ పూర్తిగా సాధించలేకపోయింది. పెట్టుబడికి ఎల్లలెరుగని స్వేచ్ఛ ఇవ్వడానికి వెనుకబడిన దేశాలు పూర్తిగా సిద్ధంగా లేవు. ఎక్కువ భాగం ఇచ్చాయి, కొంత నిరాకరిస్తున్నాయి. సేవారంగంలో స్వేచ్ఛా విపణిని ఆవిష్కరించడానికి కూడ అదే రకంగా సంశయిస్తున్నాయి. వ్యవసాయరంగానికీ ఆరోగ్యానికీ సంబంధించినంత వరకు పేటెంట్ హక్కులు పూర్తిగా ఇవ్వడానికి కూడ తటపటాయిస్తున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ సమావేశాలలో గుంపుగా వ్యవహరించి కొన్ని మినహాయింపులు సాధించుకున్నాయి. ఈ దేశాల ప్రజల ప్రయోజనాలను లెక్కించినప్పుడు ఈ సంశయాలూ తటపటాయింపులూ మినహాయింపులూ చిన్నవే అయినప్పటికీ, 1980ల మధ్య భాగం నుంచి మాంద్యం దిశగా నడుస్తున్న అంతర్జాతీయ పెట్టుబడికిఈ పరిస్థితి సంతృప్తినివ్వలేదు.



ఫలితంగా దాని దృష్టి ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వైపు మళ్లింది. ద్వైపాక్షిక ఒప్పందాలలో బలవంతులు బలహీనులను దబాయించి తమ అవసరాలు సాధించుకునే అవకాశం ఎక్కువ ఉంటుంది. బలహీన దేశం కూడ ఇదేదో ఒక దేశంతో చేసుకుంటున్న చిన్న ఒప్పందం లెమ్మని తన ప్రజలను బుకాయించగలుగుతుంది. ఈ ఒప్పందాలు ఒక దానికొకటి కలిసి పూర్తిస్థాయిలో 'స్వేచ్ఛావిపణి'ని ఆవిష్కరించే దాకా ప్రజలకు ఏం జరుగుతున్నదీ తెలియదు. ఇటువంటి ఒప్పందాలకు కొంతకాలంగా మన పాలకులూ ఒడిగడుతున్నారు. వీటి గురించి పార్లమెంటులో గానీ ఏ ప్రాతినిధ్య వ్యవస్థలోగానీ చర్చ జరగదు. అసలు ఏం చేస్తున్నదీ అంతా అయిపోయేదాకా తెలీదు. 2007 నుంచి ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ప్రయోగాలు జరుగుతుండగా, కొంత మంది పట్టుదల గల విమర్శకులు తమ శక్తి యుక్తులన్నీ వినియోగించి ఈ మధ్య కాలంలోనే ఈ ఒప్పందాల స్వరూపాన్ని బయట పెట్టగలుగుతున్నారు.

భారత్ 30 ఒప్పందాలు చేసుకుంటున్నదని చెప్పుకున్నాం. అందులో అన్నిటి కంటే ఎక్కువ దుష్ప్రభావం వేయగలిగింది యూరోపియన్ యూనియన్ (ఇ.యు)తో చేసుకుంటున్న ఒప్పందం. ఈ ఒప్పందం ఇంకా తుదిరూపం తీసుకోలేదు గానీ, ప్రపంచ వాణిజ్య సంస్థ సమావేశాలలో భారత్ వ్యతిరేకించిన అనేక విషయాలు ఈ ఒప్పందంలో ఉన్నాయనేది స్పష్టం అవుతున్నది. వ్యవసాయ పేటెంట్ల విషయంలో, ప్రపంచ వాణిజ్య సంస్థను కొంత మేరకు రాజీకి ఒప్పించి భారత్ చేసిన చట్టం ప్రకారం, ఒక కంపెనీ పేటెంట్ తీసుకుని ఉత్పత్తి చేసిన విత్తనాన్ని కొనుక్కున్న రైతు దానితో పంట పండించుకోవడమే కాక విత్తనం మిగిలించుకోవచ్చు, మళ్ళీ పంట పెట్టుకోవచ్చు, ఇరుగుపొరుగుతో ఆ విత్తనాన్ని పంచుకోవచ్చు. అమ్ముకోవడానికి మాత్రం వీలులేదు. ఇప్పుడు ఇ.యు.తో చేసుకుంటున్న ఒప్పందం ప్రకారం రైతు విత్తనాన్ని మిగుల్చుకొని మళ్లీ విత్తడానికి కూడ కంపెనీ అనుమతి తీసుకోవాలి. అప్పుడు కూడ తన పొలంలో మాత్రమే విత్తాలి. పక్క వారికి అరువియ్యడానికి వీలులేదు.

దీని ప్రకారం వాణిజ్యరంగంలో దిగుమతి సుంకాలు సహితం భారత్ ఇంకా భారీగా తగ్గించవలసి ఉంటుంది. 1990 నాటికి దిగుమతి సుంకాలు సగటున 78 శాతం ఉండేవి. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒత్తిడి మేరకు 2005 నాటికి 17 శాతానికి పడిపోయాయి. ఇ.యు.తో చేసుకున్న ఒప్పందం ఫలితంగా దిగుమతి సుంకాలు శూన్యాన్ని చేరుకోవలసి వస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో ఏ రంగాన్నీ వారు వదులుకోదలుచుకోలేదు. మనదేశంలో ప్రభుత్వం తన పాలనా బాధ్యతల నిమిత్తం కొన్ని కొనుగోళ్లు చేస్తుంది, టెండర్ ద్వారా కొన్ని పనులు చేయిస్తుంది. లెవీ ధాన్యం సేకరణ, లెవీ సిమెంటు సేకరణ, రోడ్లు, బ్రిడ్జిలు వగైరా నిర్మించడం మొదలయినవి ఈ కోవకు చెందినవి. ఇది దేశ జాతీయాదాయంలో 13 శాతం ఉంటుందని అంచనా. ఈ రంగంలో కూడ విదేశీ కంపెనీలకు చోటివ్వాలని– అంటే ఉదాహరణకు రోడ్డు పనులు కల్వర్టు, పనులు విదేశీ కంనీలు చేపట్టే అవకాశం ఇవ్వాలని– ప్రపంచ వాణిజ్య సంస్థలో ప్రతిపాదన వచ్చినప్పుడు ఇండియా వంటి దేశాలు గట్టిగా వ్యతిరేకించాయి గానీ ఇ.యు.తో చేసుకుంటున్న ఒప్పందంలో అది ఉంది.

మనల్ని నిస్సహాయంగా పక్కకు నెట్టి మన జీవితాలను వినాశనంవైపు తీసుకుపోతున్న విపత్తులలో 'ప్రకృతి బీభత్సాలు' మాత్రమే కాదు విపరీతరూపం తీసుకున్న పెట్టుబడి దాహం కూడా ముఖ్యమైనది. ప్రపంచ వాణిజ్య సంస్థను దీని ప్రధాన సాధనంగా చాలా కాలంగా భావిస్తూ వస్తున్నాముగానీ దానిని దాటిపోయేవి మన ప్రభుత్వం దాదాపు 30 దేశాలతో చేసుకున్న, చేసుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టిఏలు). వీటి ఫలితాలు మన మీద వచ్చి పడకముందే వీటి గురించి కొంచెమైనా తెలుసుకొని వ్యతిరేకించడం అవసరం.

చిల్లర వ్యాపారం (రీటైల్ మార్కెట్) మరొకటి. భారత ఆర్థిక రంగంలో ఇదొక పెద్ద వ్యవస్థ. దేశంలోని మొత్తం ఆర్థిక సంస్థలలో 85 శాతం ఇవేననీ అందులో దాదాపు 9 కోట్ల మంది పనిచేస్తారనీ అయిదవ ఆర్థిక సెన్సస్ లెక్కలు తెలుపుతున్నాయి. ఈ రీటైల్ మార్కెట్ వ్యవస్థ తలుపులు విదేశీ పెట్టుబడికి తెరవాలని ప్రపంచ వాణిజ్య సంస్థలో వచ్చిన ప్రతిపాదనను భారత్ వంటి బడుగు దేశాలు వ్యతిరేకించాయి. కానీ ఇ.యు.తో భారత్ చేసుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో ఇది సహితం ఉంది. ఆరోగ్యం విషయమూ అంతే. మందులకు పూర్తిస్థాయిలో పేటెంట్ హక్కులు ఉండాలని ప్రపంచ వాణిజ్య సంస్థ అంటుండగా, భారత్ వంటి దేశాలు ప్రజారోగ్యానికి సంబంధించినంతవరకు కొంత మినహాయిపు పొందాయి. ఇప్పుడు భారత్ ఇ.యు.తో చేసుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో ఇది లేదు. ఇది మందుల ధరలు విపరీతంగా పెరగగలవనడానికి సూచి.

ఈ ఒప్పందాలు చేసుకుంటున్నది 30 దేశాలతోనే కదా అనుకోవద్దు. ప్రపంచవాణిజ్య సంస్థ వ్యవస్థాపక నియమాలలో ఒకటేమిటంటే ఒక సభ్య దేశం ఇతర సభ్య దేశాల మధ్య వివక్షపాటించడానికి వీలులేదు. అంటే ఒకరికి ఇచ్చిన వాణిజ్య స్వేచ్ఛ ఇంకొకరికి నిరాకరించడానికి వీలులేదు. దీనికి భారత్ ఏ మినహాయింపూ కోరలేదు కాబట్టి జరుగుతున్నదేమిటంటే ప్రపంచవాణిజ్య సంస్థ చర్చలలో తిరస్కరిస్తున్నట్టు కనిపించిన వినాశకరమైన సూత్రాలను ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల రూపంతో భారత్ తిరిగి తెచ్చుకోవడం!